సాక్షి జగిత్యాల

బుధవారం । 9 । అక్టోబర్ । 2024

ఎస్పీ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు

జగిత్యాలక్రైం: సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ అని ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. మంగళవారం రాత్రి ఎస్పీ కార్యాలయం ఆవరణలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ ఉత్సవాలను ఎస్పీ తన సతీమణితో కలిసి ప్రారంభించారు. తొమ్మిది రోజులపాటు ఉత్సవాలు నిర్వహించుకోవడం గర్వకారణమన్నారు. జిల్లా ప్రజలకు బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ భీంరావు, డీఎస్పీలు రవీంద్ర, రఘుచందర్, ఏఓ శశి, సీఐలు వేణుగోపాల్, కృష్ణారెడ్డి, ఆర్ఐ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మ వద్ద సతీమణితో ఎస్పీ అశోక్‌కుమార్, పోలీస్‌శాఖ సిబ్బంది

న్యూస్‌రీల్

జగిత్యాలలో సీఎంకప్ టార్చ్ ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న కమిషనర్ సమ్మయ్య, రవికుమార్

జగిత్యాల: రాష్ట్రప్రభుత్వం నిర్వహించే క్రీడల్లో ప్రతిఒక్కరూ పాల్గొనాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి రవికుమార్ అన్నారు. జిల్లాకేంద్రంలో సీఎం కప్ టార్చ్ ర్యాలీని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యతో కలిసి మంగళవారం ప్రారంభించారు. గ్రామీణప్రాంత క్రీడాకారులను వెలుగులోకి తీసుకొచ్చేందుకు వివిధ కేటగిరీల్లో సీఎం కప్–2024 పోటీలు ఉంటాయన్నారు. ఎస్‌కేఎన్ఆర్ కళాశాల వద్ద ప్రారంభమైన ర్యాలీ.. స్వామి వివేకానంద స్టేడియం వరకు కొనసాగింది. ర్యాలీ ఈనెల 17వరకు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో క్రీడ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా రాజేశ్



కోరుట్ల: పట్టణానికి చెందిన న్యాయవాది గోనె రాజేశ్ ఖన్నా రాష్ట్ర ప్రభుత్వ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాజేశ్‌ఖన్నా మూడేళ్లపాటు ప్రభుత్వం తరఫున పలు సివిల్ కేసులు వాదించనున్నారు. తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

అలరించిన చిన్నారుల నాట్య ప్రదర్శన



అనంత పద్మనాభస్వామి ఆలయం ఎదుట ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులు

జగిత్యాల: కేరళ రాష్ట్రం తిరువనంతపురంలోని అనంత పద్మనాభస్వామి ఆలయం ఎదుట జిల్లాకేంద్రంలోని మేదిని కళాక్షేత్రం నిర్వాహకులు బొమ్మిడి నరేశ్‌కుమార్ ఆధ్వర్యంలో చిన్నారుల కూచిపూడి నాట్య ప్రదర్శన చేపట్టారు. బతుకమ్మ ఆటతో రాష్ట్ర సంస్కృతిని చాటారు. కార్యక్రమంలో జంగిలి లాస్య, సౌందర్య లక్ష్మీ, గౌతమి, అర్చన పాల్గొన్నారు.

ఆరుగ్యారంటీలపై సీఎంకు చిత్తశుద్ధి లేదు



మాట్లాడుతున్న దావ వసంత

రాయికల్: సీఎం రేవంత్‌రెడ్డికి ఆరుగ్యారంటీలపై చిత్తశుద్ధి లేదని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మూసీనది ప్రక్షాళనకు రూ.1.50లక్షల కోట్లు ఖర్చు చేస్తామంటున్న సీఎం.. ఆరుగ్యారంటీలపై ఎందుకు చిత్తశుద్ధి చూపడం లేదని ప్రశ్నించారు. రైతుబంధు, రుణమాఫీ, ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మీ, తులం బంగారం, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు నిధులు మంజూరు చేయకపోవడం శోచనీయమన్నారు. కార్పొరేట్ కళాశాలలను తనిఖీ చేస్తున్న మహిళాకమిషన్ ఒకసారి ప్రభుత్వ గురుకులాలకు వెళ్తే విద్యార్థుల సమస్యలు తెలుస్తాయన్నారు. బీఆర్ఎస్ హయాంలో కేటాయించిన నిధులే తప్ప.. ఇప్పటివరకు ఎలాంటి అభివృద్ధి జరగలేదని గుర్తుచేశారు. ఆమె వెంట బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎలిగేటి అనిల్, మహిళా అధ్యక్షురాలు స్వందన, కౌన్సిలర్లు శ్రీధర్‌రెడ్డి, మహేశ్‌గౌడ్, సాయి, మహేందర్, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ ఉదయశ్రీ, మండల సమన్వయ కమిటీ సభ్యులు బర్కం మల్లేశం, దొంతి నాగరాజు, కంటె గంగారాం పాల్గొన్నారు.

కాత్యాయిని రూపంలో అమ్మవారు



ధర్మపురి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు మంగళవారం కాత్యాయిని రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధం శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో దసరా ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో ఆరోరోజు అమ్మవారిని ఆకుపచ్చ రంగు చీరలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఐరావత వాహనంపై శ్రీలక్ష్మీనృసింహస్వామి

ధర్మపురి:శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో మంగళవారం సాయంత్రం ఐరావత వాహనంపై శ్రీయోగా, ఉగ్ర లక్ష్మీనృసింహ స్వాములను ఊరేగించారు. పట్టణ పురవీధుల మీదుగా శోభాయాత్ర చేపట్టారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు.



శేషవాహనంపై బీర్‌పూర్ నృసింహస్వామి

సారంగాపూర్: బీర్‌పూర్‌లోని శ్రీలక్ష్మీనృసింహస్వామివారు, అమ్మవారికి మంగళవారం శేషవాహన సేవ నిర్వహించారు. ఆలయంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం శేషవాహనంపై ఆసీనులను చేసి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. ఆలయ అర్చకులు వొద్దిపర్తి పెద్ద సంతోష్, చిన్న సంతోష్, మధుకుమారాచార్యులు పాల్గొన్నారు.

మహా బతుకమ్మ టెండర్లలో గోల్‌మాల్

మహిళాసంఘాలకు మొండిచేయి

- తక్కువ ధర కోట్ చేసిన వ్యక్తికి కాంట్రాక్టు అప్పగింత
- పండుగకు ఒకరోజు ముందు టెండర్ ఖరారు చేసిన అధికారులు
- బల్దియా ఆదాయానికి గండి పడిందంటున్న ప్రజలు



మున్సిపల్ ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే మహాబతుకమ్మకు హాజరైన మహిళలు (ఫైల్)

జగిత్యాల: ఏటా మున్సిపాలిటీ, మెప్మా ఆధ్వర్యంలో మహాబతుకమ్మ కార్యక్రమాన్ని జగిత్యాల బల్దియా కార్యాలయం ఎదుట నిర్వహిస్తారు. ఇందుకు రూ.5లక్షలు కేటాయిస్తారు. ఎప్పటిలాగే ఈసారి కూడా నిర్వహించే ఈ కార్యక్రమాన్ని తమకు అప్పగించాలని మెప్మా మహిళాసంఘాలు బల్దియాను కోరాయి. మహిళల పండుగ కావడంతో పనులు తమకే ఇవ్వాలని కమిషనర్, కలెక్టర్‌కు వినతిపత్రం అందించాయి. సరేనన్న అధికారులు శనివారం టెండర్లు పిలిచారు. బుధవారం మహాబతుకమ్మ నిర్వహించాల్సి ఉంది. బతుకమ్మ పేర్చడం, బ్యాండ్, డీజే, వీడియోగ్రఫీ, మెమొంటోలతోపాటు మొత్తంగా 28 రకాల పనులు చేయాల్సి ఉంటుంది.

కుమ్మక్కైన కాంట్రాక్టర్లు

మహాబతుకమ్మ కోసం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో టెండర్లు పిలవగా.. ముగ్గురు కాంట్రాక్టర్లు టెండర్లు వేశారు. ఇందులో ఒకతను 29.99శాతంతో టెండర్ కోట్ చేశాడు. అయితే అతడిపై రాజకీయ ఒత్తిడి రావడంతో టెండర్ నుంచి తప్పించుకున్నట్లు సమాచారం. మరొకరికి జీఎస్టీ లేదని పక్కకు పెట్టారు. వాస్తవానికి సదరు వ్యక్తి వేరే అభివృద్ధి పనులకు టెండర్ వేసినప్పుడు ఆయనకే అప్పగించారు. ఇప్పుడు మాత్రం జీఎస్టీ లేదని పక్కకుపెట్టడంలో ఆంతర్యమేమిటో తెలియాల్సి ఉంది. వీరిద్దరినీ కాదని రెండు శాతానికి కోట్ చేసిన కాంట్రాక్టర్‌కు మహాబతుకమ్మ పనులు అప్పగించారు. ఒకవేళ 29 శాతానికి టెండర్ వేసిన కాంట్రాక్టర్‌కు పనులు అప్పగిస్తే మున్సిపాలిటీకి రూ.లక్ష నుంచి రూ.2లక్షల ఆదాయం లభించేది. రూ.5 లక్షల టెండర్ కావడం.. రెండు శాతం కోట్‌కే టెండర్ అప్పగించడంతో పనులకు రూ.4లక్షలకుపైగానే చెల్లించాల్సి ఉంటుంది.

డీజేలకూ టెండర్లు

జగిత్యాలలో ఎక్కడైనా కార్యక్రమం చేపడితే మున్సిపాలిటీ నుంచే డీజేలు, ఇతర సామగ్రిని ఏర్పాటు చేస్తుంటారు. తాజాగా వాటికీ టెండర్లు నిర్వహించినట్లు తెలిసింది. కార్యక్రమాలు నిర్వహించిన చోట మున్సిపల్ నుంచి డీజేలు, మొరం పోయిస్తుంటారు. అలాగే బతుకమ్మ నిమజ్జనం వద్ద ఘాట్లను ఏర్పాటు చేసేందుకు టెండర్లు చేపట్టారు. కేవలం రెండురోజుల్లో ఘాట్ల నిర్మాణం అవుతుందా..? అని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కొన్ని టెండర్లు ఆన్‌లైన్‌లో నిర్వహించగా.. మరికొన్ని బాక్స్ టెండర్లు నిర్వహించారు. ఇప్పటికే మున్సిపాలిటీలో అంతా అవినీతిమయంగా మారిందని ఆరోపణలు వస్తుండగా.. మహాబతుకమ్మ టెండర్లలో సైతం కుమ్మక్కయ్యారన్న విమర్శలు సర్వత్రా వెల్లువెత్తుతున్నాయి.

పల్లె దవాఖానాలతో ప్రజలకు మెరుగైన వైద్యం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, పాల్గొన్న నాయకులు

- ప్రతి కుటుంబానికి రేషన్‌కార్డుల జారీ
- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్: పల్లె దవాఖానాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేటలో రూ.20 లక్షలతో నిర్మించనున్న పల్లెదవాఖానాకు మంగళవారం భూమిపూజ చేశారు. సంగంపల్లి, హబ్సీపూర్‌లో గ్రామపంచాయతీ భవనాలను ప్రారంభించారు. ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉపయోగమన్నారు. గ్రామాల్లో లేఅవుట్ ప్రకారం ఇళ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. అభివృద్ధి విషయంలో అధికారులు బాధ్యతతో పనిచేయాలని సూచించారు. బీసీ కుల గణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని పేర్కొన్నారు. అంబారిపేటలో రూ.2 కోట్లతో చేపట్టిన అర్బన్ ఫారెస్ట్ పార్క్ అభివృద్ధి పనులను, టీటీడీ భజన మందిరం స్థల పరిశీలన చేశారు. పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు పార్క్ నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అర్బన్ పార్క్‌లోనే చెరువును ఏర్పాటు చేసి వేసవిలోనూ జలకళ ఉండేలా సోలార్ బోర్ పంప్ ఏర్పాటు చేశామన్నారు. డీఎఫ్‌వో రవిప్రసాద్, ఎంపీడీవో రమాదేవి, ఎంపీవో వాసవి, ఎఫ్ఆర్వో పద్మారావు, డీఆర్వో అరుణ్, మాజీ జెడ్పీటీసీ ఎల్లారెడ్డి, సింగిల్ విండో చైర్మన్లు సందీప్‌రావు, మహిపాల్‌రెడ్డి, మాజీ సర్పంచులు రాజేశ్వర్‌రెడ్డి, మల్లమ్మ, తహసీల్దార్ శ్రీనివాస్, డీఈ మిలింద్, ఏఎంసీ మాజీ చైర్మన్ దామోదర్ రావు, కౌన్సిలర్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

జగిత్యాల: గోవిందుపల్లిలోని నవదుర్గ సేవ సమితి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన అమ్మవారిని ఎమ్మెల్యే దర్శించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, కౌన్సిలర్ ప్రేమలత, సత్యం, కూసరి అనిల్ పాల్గొన్నారు.

చర్లకొండాపూర్‌లో 'భగీరథ' నీరందించండి



చెర్లకొండాపూర్ గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

- ఫ్లోరైడ్ సమస్యకు చెక్ పెట్టండి
- కలెక్టర్‌కు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ
- గ్రామస్తులతో సమావేశం

సాక్షి స్పందన

రాయికల్: మండలంలోని చెర్లకొండాపూర్ గ్రామంలో ఫ్లోరైడ్ సమస్యను వెంటనే పరిష్కరించాలని, గ్రామానికి మిషన్ భగరీథ నీటిని సరఫరా చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కలెక్టర్‌ను కోరారు. ఈనెల 4న 'చెర్లకొండాపూర్‌లో ఫ్లోరైడ్ భూతం..?' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన ఎమ్మెల్సీ మంగళవారం గ్రామంలో పర్యటించారు. తాగునీటి బావులను పరిశీలించారు. గ్రామంలో యుద్ధప్రతిపాదికన మిషన్ భగీరథ నీటిని మంచినీటి బావికి బూస్టర్ పంప్ సెట్ ద్వారా అనుసంధానం చేసేలా చర్యలు చేపట్టాలని ఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. ఆయన వెంట పల్లికొండ రమేశ్, నాయకులు రాజేందర్, రమేశ్, బాలరాజు, బాలయ్య, లక్ష్మీనారాయణ, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు అరికట్టాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సమియోద్దీన్

జగిత్యాల: సీజనల్ వ్యాధులను అరికట్టాలని డీఎంహెచ్‌వో సమియోద్దీన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎంఎల్‌హెచ్‌పీలకు శిక్షణ ఇచ్చారు. డెంగీ నిర్ధారణ పరీక్షలు చేయడంలో జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, ప్రోగ్రాం ఆఫీసర్లు జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బతుకమ్మను ఆనందంగా నిర్వహించుకోవాలి



మాట్లాడుతున్న విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

వెల్గటూర్ : బతుకమ్మ వేడుకలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ అన్నారు. మంగళవారం ఎండపల్లి మండలం రాజారాంపల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో లక్ష్మణ్ కుమార్ వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బతుకమ్మ ఉత్సవాల నిర్వహణలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని, మహిళలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని దిశానిర్దేశం చేశారు. బతుకమ్మ ఘాట్‌ల వద్ద లైటింగ్, మంచినీరు, టాయిలెట్స్ ఇతర సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అనంతరం దుర్గాదేవి నవరాత్రోత్సవాలలో భాగంగా కొత్తపేట గ్రామంలో దుర్గాదేవిని దర్శించుకున్నారు. అడిషనల్ కలెక్టర్ గౌతంరెడ్డి, డీపీవో రఘువరన్, డీఆర్డీవో సాయిబాబా, ఆర్డీవో మధుసూదన్ తహశీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్హులైన ఓటర్లను నవంబర్ 6లోగా నమోదు చేయాలి

- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ రాంబాబు

జగిత్యాల: పట్టభద్రుల ఎమ్మెల్సీ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అర్హులైన ఓటర్లను నవంబర్ 6లోపు నమోదు చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్లతో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉపాధ్యాయుల ఫారం–19 ప్రకారం, పట్టభద్రులు ఫారం–18 ప్రకారం దరఖాస్తులను నవంబర్ 6లోపు సమర్పించాలన్నారు. ఫారంలను తహసీల్దార్, రెవెన్యూ కార్యాలయంలో మ్యాన్యువల్‌గా లేదా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నవంబర్ 23న డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రదర్శించాలని, 9న అభ్యంతరాలు స్వీకరించి డిసెంబర్ 25లోపు పరిష్కరించి 30న తుది జాబితా ప్రకటించాలన్నారు. ఓటరుపై విస్తృత ప్రచారంకల్పించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ రాంబాబు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

మక్కలు కొంటారా.. కొనరా..

- ఇప్పటికీ ఏర్పాటు చేయని కొనుగోలు కేంద్రాలు
- మొన్నటివరకు క్వింటాల్‌కు రూ.మూడు వేలు
- పోటీపడి కొనుగోలు చేసిన వ్యాపారులు
- ప్రస్తుతం క్వింటాల్‌కు రూ.2200 నుంచి రూ.2400



ఆరబెట్టిన మొక్కజొన్న పంట

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో వరి తర్వాత ప్రధాన పంట మొక్కజొన్న. అలాంటి ఈ పంటను అడవి పందులు, రామచిలుకలు, కోతులు విపరీతంగా ధ్వంసం చేస్తుంటాయి. వాటి బారి నుంచి కాపాడుకునేందుకు రైతులు రాత్రింబవళ్లు కష్టపడితేగానీ చేతికి అందదు. తీరా చేతికొచ్చిన పండిన అమ్ముకుందామంటే సరైన ధర రాక రైతులు దిక్కులు చూడాల్సిన దుస్థితి నెలకొంది. ఏటా మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వ మద్దతు ధరకు మొక్కజొన్నను కొనుగోలు చేపట్టే ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయమూ తీసుకోకపోవడంతో రైతుల్లో అయోమయం నెలకొంది.

జిల్లాలో 54,086 ఎకరాల్లో సాగు

జిల్లాలో ప్రస్తుత వానాకాలం సీజన్‌లో 54,086 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశారు. ఎకరాకు 25 క్వింటాళ్ల చొప్పున జిల్లాలో 13.52 లక్షల క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉంది. కానీ.. ఈసారి వర్షాలు అధికంగా కురవడంతో పంట 30 నుంచి 40 శాతం దెబ్బతింది. అయినప్పటికీ సగటున ఎకరాకు 15 నుంచి 18 క్వింటాళ్ల వరకు దిగుబడి సాధించారు రైతులు. దీని ప్రకారం జిల్లాలో సుమారు 8లక్షల నుంచి 9 లక్షల క్వింటాళ్లు మొక్కజొన్న దిగుబడి రానుంది. ప్రస్తుతం రైతులు మొక్కజొన్న పంటను కోసే పనిలో ఉన్నారు.


మొన్నటివరకు రూ.3వేల ధర

మొక్కజొన్నకు ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,225. కానీ.. మొన్నటివరకు ప్రభుత్వ మద్దతు ధరను మించి క్వింటాల్‌కు రూ.3వేల వరకు పలికింది. ఇప్పుడు పంట చేతికి రాగానే ధర అమాంతం రూ.600 నుంచి రూ.800వరకు పడిపోయింది. ఇప్పుడు రూ.2400 నుంచి రూ.2200కే కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో పండించిన మొక్కజొన్నలు పూర్తిస్థాయిలో మార్కెట్‌కు వస్తే వ్యాపారులు ధర మరింతగా తగ్గించే అవకాశాలు కనిపిస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఇప్పటివరకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదు. దీనిని అదునుగా చేసుకుంటున్న వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని రైతులు తలలు పట్టుకుంటున్నారు.

వ్యాపారుల మాయాజాలంలో రైతులు విలవిల

మొక్కజొన్నను బిస్కెట్ తయారీలో.. కోళ్లు, పశువుల దాణాతోపాటు పలు రకాలుగా ఉపయోగిస్తున్నారు. దీంతో మొక్కజొన్నలకు డిమాండ్ ఉంది. అయితే పొరుగు రాష్ట్రాల నుంచి మొక్కజొన్నలు తక్కువ ధరకు వస్తున్నాయంటూ దళారులు రేటు తగ్గిస్తున్నారు. వాస్తవానికి ఎకరా మొక్కజొన్న సాగుకు కనీసం రూ.20వేల నుంచి రూ.25వేల వరకు పెట్టుబడి అవుతుంది. ఆరుగాలం కష్టించి పండించిన పంటకు పెట్టుబడి కూడా రాకపోతే ఎలా జీవనం సాగించేదని రైతులు అయోమయానికి గురవుతున్నారు. ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే రైతులకు మేలు జరిగే అవకాశాలు ఉన్నాయి. సర్కారు స్పందించి ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.


కేంద్రాలు ఏర్పాటు చేయాలి



ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. అప్పుడే మొక్కజొన్నలకు మద్దతు ధర లభిస్తుంది. ప్రతిరోజూ వర్షం కురుస్తుండటంతో మొక్కజొన్నలు మొలక వస్తున్నాయి. వ్యాపారులకు తక్కువ ధరకు విక్రయించే పరిస్థితి వస్తోంది.

– రాజిరెడ్డి, శ్రీరాములపల్లె, గొల్లపల్లి

వ్యాపారులు చెప్పిందే రేటు



కొనుగోలు కేంద్రాలు లేకుంటే వ్యాపారులు మరింత తక్కువ ధరకు కొనుగోలు చేసే అవకాశం ఉంది. ఇప్పుడు బహిరంగా మార్కెట్‌లో ప్రభుత్వ ధరకు సమానంగా లభిస్తున్నా.. కేంద్రాలు లేకుంటే వ్యాపారులు ఆడింది ఆటగా మారే అవకాశం ఉంది.

– గడ్డం గంగారెడ్డి, చల్‌గల్

క్లుప్తంగా

కరీంనగర్ మేయర్‌పై అట్రాసిటీ కేసు

కరీంనగర్ క్రైం: కరీంనగర్ నగరపాలక సంస్థ మేయర్ యాదగిరి సునీల్‌రావుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ టూ టౌన్ సీఐ విజయ్‌కుమార్ మంగళవారం తెలిపారు. వివిధ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరగా మేయర్ తనను కులం పేరుతో దూషించారని 44వ డివిజన్ కార్పొరేటర్ మెండి శ్రీలత కోర్టును ఆశ్రయించారని అన్నారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు ఆయనపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మాజీ ఎమ్మెల్యే 'మాలెం' ఇంట్లో చోరీ

- 12 తులాల బంగారం, రూ.50 వేలు అపహరణ


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

గోదావరిఖని(రామగుండం): మాజీ ఎమ్మెల్యే, దివంగత మాలెం మల్లేశం ఇంట్లో దొంగలు పడి బంగారం, నగదు ఎత్తుకెళ్లారు. ఆయన కుమారుడు కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. కిరణ్ సోమవారం ఇంటికి తాళం వేసి, కుటుంబసభ్యులతో కలిసి ఊరికి వెళ్లాడు. రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడ్డారు. మంగళవారం తెల్లవారుజామున కిరణ్ ఇంటికి రాగా, తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి, పరిశీలించాడు. బీరువాలోని 12 తులాల బంగారం, రూ.50 వేలు కనిపించలేదు. దీంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకొని, గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు క్లూస్ టీంతో సంఘటన స్థలానికి చేరుకున్నారు. వివరాలు, వేలిముద్రలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ రెండో సీఐ రవీందర్ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

కొండగట్టు(చొప్పదండి): జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని నాచుపల్లికి చెందిన గోలి సదానందం(48) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సదానందం అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుడికి భార్య తార, ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆస్తి వివాదం.. వృద్ధుడి ఆత్మహత్యాయత్నం


ఒంటిపై డీజిల్ పోసుకుంటున్న చంద్రయ్య

కొండగట్టు(చొప్పదండి): ఆస్తి వివాదం నేపథ్యంలో ఓ వృద్ధుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. ఎస్సై సందీప్ వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన నాంపెల్లి రాజేశం, చంద్రయ్య అన్నదమ్ములు. ఇద్దరి మధ్య ఆస్తి వివాదం తలెత్తడంతో కుల పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు జరిగాయి. అయినా, తనకు న్యాయం జరగలేదంటూ చంద్రయ్య మంగళవారం రోడ్డుపైకి వచ్చి, ఒంటిపై డీజిల్ పోసుకున్నాడు. స్థానికులు అడ్డుకొని, అతన్ని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

'సిద్ధుల' బతుకమ్మలు

- కొత్త కోడళ్ల వాయినాలకు ప్రత్యేకం
- సిరిసిల్ల కాగితపు బతుకమ్మలకు క్రేజ్
- తయారీలో సిద్ధహస్తులు సిద్ధులు
- రేపు సద్దుల బతుకమ్మ


సిరిసిల్లలో సిద్ధులు తయారు చేసిన కాగితపు బతుకమ్మలు

సిరిసిల్లటౌన్: రంగురంగుల కాగితపు పూలతో పేర్చే బతుకమ్మలకు పెట్టింది పేరు సిరిసిల్ల. బతుకమ్మ పూలు దొరకనప్పుడు వీటిని పూజించడం అనాదిగా వస్తోంది. ముఖ్యంగా కొత్త కోడళ్ల వాయినాలకు ఇవి ప్రత్యేకం. సిరిసిల్ల పట్టణానికి చెందిన సిద్ధుల కులస్తులు ఏళ్లుగా ఈ బతుకమ్మలను తయారు చేస్తూ ఉపాధి పొందుతున్నారు.

పూల కొరతతో పెరిగిన ఆర్డర్లు

తెలంగాణ ఆవిర్భావం తర్వాత బతుకమ్మకు రాష్ట్ర పండుగగా గుర్తింపు వచ్చింది. ఏటా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వేడుకలు జరుగుతున్నాయి. కాలానుగుణంగా బతుకమ్మ పేర్చేందుకు కావాల్సిన గునుగు, తంగేడు తదితర పూల కొరత ఏర్పడింది. దీంతో సిద్ధుల బతుకమ్మలకు ఆర్డర్లు పెరిగాయి. ఏటా పండుగకు కొన్ని రోజుల ముందు నుంచే బతుకమ్మలు తయారు చేస్తున్నారు. వెదురు పుల్లలను బతుకమ్మ ఆకారంలో ఉంచి, వాటిపై కాగితపు పూలను అతికిస్తారు. నెల రోజులపాటు ఇంటిల్లిపాది కాగితపు బతుకమ్మలను తయారు చేసి, గురువారం జరుపుకోనున్న సద్దుల బతుకమ్మకు అమ్మకానికి సిద్ధంగా ఉంచారు.

సిద్ధులకు కులవృత్తిగా..

కాగితపు పూలతో అందమైన బతుకమ్మలను తయారు చేయడంలో సిద్ధుల కులస్తులది అందెవేసిన చేయి. తరతరాలుగా వీరు కులవత్తిగా బతుకమ్మలను తయారు చేస్తున్నారు. సిరిసిల్ల పాత బస్టాండ్ ప్రాంతంలో ఈ కులస్తులకు ప్రత్యేకంగా కాలనీ ఉండటం విశేషం. పండుగలకు పూజా, అలంకార సామాగ్రి విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ఏటా బతుకమ్మ పండుగ వస్తుందంటే చాలు సుమారు 30 కుటుంబాలు కాగితపు పూలతో ఒక్క అడుగు నుంచి పది అడుగుల పొడవు వరకు బతుకమ్మలు తయారు చేస్తారు. వాటిని రూ.50 నుంచి రూ.1,200 వరకు విక్రయిస్తారు. సిద్ధులు ఉన్నత చదువులు చదివినా వంశపారపర్యంగా వస్తున్న ఆచారాన్ని ఇప్పటికీ కొనసాగిస్తున్నారు.

ఖర్చులు పెరిగాయి



మ్యాదరి కట్టెలు, రంగు కాగితాల ధరలు పెరగడంతో తయారీ ఖర్చులు పెరిగాయి. పల్లెల నుంచి ఆర్డర్లు తీసుకుంటూ బతుకమ్మలు చేస్తున్నాం. కాగితపు బతుకమ్మలను వాయినాలకు కొంటారు. పూల రేటు పెరిగితే మేము తయారు చేసే బతుకమ్మలకు డిమాండ్ వస్తుంది. ఆర్థికంగా వెనకబడిన మమ్మల్ని సర్కారు ఆదుకోవాలి.

– గడిపాక మానస, సిరిసిల్ల

తరతరాలుగా ఇదే వృత్తి



కాగితపు బతుకమ్మల తయారీ మాకు తరతరాలుగా వస్తున్న వృత్తి. ఆర్థికంగా వెనకబడిన మాకు బ్యాంకు నుంచి రుణాలు ఇప్పించాలి. కాగితాలను వరుసలో అతికించడానికి ఎక్కువ సమయం పడుతుంది. ఒక్కో బతుకమ్మను రూ.10 లాభంతో అమ్ముకుంటం. పండుగకు గునుగు పూలు దొరక్కపోతేనే మాకు గిరాకీ ఎక్కువ ఉంటది.

– సిద్ధుల ప్రవళిక, సిరిసిల్ల

కార్మిక కుటుంబాల్లో ప్రభుత్వ కొలువులు

ముస్తాబాద్(సిరిసిల్ల): డీఎస్సీలో ముస్తాబాద్ మండలానికి చెందిన అభ్యర్థులు సత్తాచాటారు. హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందుకోనున్న అభ్యర్థుల నేపథ్యం ఇదీ..

బీడీ కార్మిక కుటుంబం నుంచి..


రాము

ముస్తాబాద్‌కు చెందిన కొంక రాజు, జ్యోతి దంపతులిద్దరూ బీడీ కార్మికులే. వీరి పెద్ద కుమారుడు కొంక రాము ఎస్జీటీ పోస్టుకు జిల్లాలో 23వ ర్యాంకు సాధించాడు. బీడీ కార్మిక కుటుంబం నుంచి వచ్చిన రాము ఒకవైపు తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉంటూ సొంతంగా ప్రిపేర్ అయ్యాడు.

కార్మికురాలి ఇంట ఉపాధ్యాయురాలు


విద్యారాణి

గంభీరావుపేట మండలం నర్మాలకు చెందిన చింతల విద్యారాణి ఎస్జీటీ పోస్టు సాధించింది. తండ్రి శ్రీనివాస్ బీడీ కంపెనీలో పనిచేస్తున్నాడు. తల్లి బీడీ కార్మికురాలు. ఇంటర్ వరకు గంభీరావుపేటలో చదివిన విద్యారాణి, డీఎడ్ వరంగల్‌లో చేసింది. పేద కుటుంబానికి చెందిన ఆమె డీఎస్సీలో 33వ ర్యాంకు సాధించి ఉపాధ్యాయ పోస్టుకు ఎంపికైంది.

ఏకైక పీడీ పోస్టు సాధించిన చామంతి


చామంతి

తెర్లుమద్దికి చెందిన చామంతి జిల్లాలో ఉన్న ఫిజికల్ డైరెక్టర్(పీడీ) పోస్టు సాధించి సత్తాచాటింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉన్న ఏకైక పీడీ పోస్టుకు 134 మంది పోటీపడ్డారు. చామంతి 56.5 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. ఈమె భర్త మహేశ్ జర్నలిస్టుగా పనిచేస్తున్నాడు. వీరికి ఒక పాప ఉండగా, భర్త ప్రోత్సాహంతోనే తాను పీడీ పోస్టు సాధించానని చామంతి ఆనందం వ్యక్తం చేసింది.

తండ్రి కల నెరవేర్చిన తనయులు


గంగయ్య


జనార్దన్

వీర్నపల్లి(సిరిసిల్ల): ప్రభుత్వ ఉద్యోగులుగా స్థిరపడాలన్న తండ్రి కలను సాకారం చేశారు తనయులు. కానీ ఆ సంతోషాన్ని చూడకుండానే నాన్న మృతి చెందడాన్ని గుర్తు చేసుకుంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం ఉమ్మడి మద్దిమల్లలోని బంజేరు గ్రామానికి చెందిన కన్నం మల్లయ్య-మణెవ్వ దంపతుల కుమారులు గంగయ్య, జనార్దన్ ఎస్జీటీ ఉద్యోగం సాధించారు. ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్నప్పుడు తండ్రి హఠాన్మరణం చెందడం ఆ కుటుంబంలో విషాదం నింపింది. తండ్రి మరణం దిగమింగుతూ మరోపక్క డీఎస్సీ–2008కి ప్రిపేర్ అయ్యారు. అప్పుడు గంగయ్య ఉద్యోగానికి ఎంపికవగా, జనార్దన్ అరమార్కుతో ఉద్యోగం కోల్పోయాడు. మళ్లీ ప్రయత్నించినా ఉద్యోగం రాలేదు. కానీ, తన తండ్రి కలను సాకారం చేయాలని జనార్దన్ పట్టుదలతో శ్రమించి డీఎస్సీ–2024లో ఎస్జీటీగా ఎంపికయ్యాడు.

ఏడాదిలో మూడు ఉద్యోగాలకు ఎంపిక


కిరణ్‌కుమార్

సైదాపూర్: కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని వెన్నంపల్లి గ్రామానికి చెందిన మొలుగూరి కిరణ్‌కుమార్ ఏడాదిలో మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. ఇతనిది నిరుపేద కుటుంబం. ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చదువుతూ.. పోటీ పరీక్షలు రాశాడు. ఈ ఏడాది జూలైలో టీఆర్ఈఐఆర్‌బీ ప్రకటించిన గురుకుల ఉపాధ్యాయ నియామక ఫలితాల్లో జోన్–3లో రెండో ర్యాంక్‌తో సోషల్ టీజీటీగా ఎంపికయ్యాడు. ప్రస్తుతం వీణవంక గురుకులంలో ఉద్యోగం చేస్తున్నా డు. సెప్టెంబర్‌లో టీజీ పీఎస్సీ ప్రకటించిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఫలితాల్లో స్టేట్ 357 ర్యాంక్, జోన్–3లో 33 వ ర్యాంక్ సాధించాడు. ఇటీవల ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో సోషల్ స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం పొందాడు.

75వ ర్యాంకుతో స్కూల్ అసిస్టెంట్‌గా..


అనూష

చిగురుమామిడి: మండలంలోని గాగిరెడ్డిపల్లికి చెందిన మంద అనూషది నిరుపేద కుటుంబం. ఆమె డీఎస్సీలో 75వ ర్యాంకు సాధించి, స్కూల్ అసిస్టెంట్(మ్యాథ్స్)గా ఎంపికైంది. భూమయ్య–మణెమ్మ దంపతులకు ముగ్గురు కూతుళ్లు. అనూష రెండో కుమార్తె. ఈమె ఒకటో తరగతి నుంచి ఏడోతరగతి వరకు గాగిరెడ్డిపల్లిలోని ప్రాథమికోన్నత పాఠశాలలో చదివింది. ఎనిమిదో తరగతి నుంచి పదోతరగతి వరకు ఇందుర్తిలో, ఇంటర్మీడియట్ సాంఘిక సంక్షేమశాఖ ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్ ఎల్కతుర్తిలో చదువుకుంది. కరీంనగర్ ఉమెన్స్ కాలేజీలో డిగ్రీ, ఓ ప్రైవేటు కళాశాలలో ఎమ్మెస్సీ ఫిజిక్స్, హుస్నాబాద్‌లో బీఈడీ పూర్తి చేసింది.

కాలిఫోర్నియాలో బతుకమ్మ వేడుకలు


కాలిఫోర్నియాలో బతుకమ్మ వేడుకల్లో మహిళలు


బతుకమ్మలతో బోద సబితారెడ్డి

అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రం బే ఏరియా శాన్ రామన్ ప్రాంతంలో బే ఏరియా తెలంగాణ సాంస్కృతిక అసోసియేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను తెలుగు రాష్ట్రాలకు చెందిన మహిళలు, కరీంనగర్ జిల్లా వాసులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. గత 15 సంవత్సరాలు ఈ వేడుకలు జరుపుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బే ఏరియా తెలంగాణ సాంస్కృతిక అసోసియేషన్ చైర్మన్ బోద ధనుంజయరెడ్డి, బోద సబిత, బోద రేవంత్‌రెడ్డి, బోద నేహారెడ్డి, బద్దం సోహన్‌రెడ్డి, శ్రావ్య, తెలుగు రాష్ట్రాల ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

– గన్నేరువరం

అన్నావదినపై దాడి చేసిన వ్యక్తికి జైలు

జగిత్యాలజోన్: సొంత అన్నావదినపై దాడి చేసిన వ్యక్తికి రెండేళ్ల జైలుశిక్షతోపాటు రూ.500 జరిమానా విధిస్తూ జగిత్యాల అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ప్రసాద్ మంగళవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాయిల్ల మురళి కథనం ప్రకారం.. బుగ్గారం మండలంలోని గోపులాపూర్‌కు చెందిన రొండి రవీందర్, మాణిక్యం అలియాస్ సంతోష్ అన్నదమ్ములు. వీరి మధ్య పాత ఇల్లు, ఎకరం భూమి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. దీనికితోడు తన కుటుంబానికి అన్నావదిన మంత్రాలు చేస్తున్నారని సంతోష్ వారిపై కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో అన్న రవీందర్ తన కుటుంబసభ్యులతో కలిసి ఫిబ్రవరి 21, 2018న ఇంట్లో భోజనం చేస్తున్నాడు. ఆ సమయంలో సంతోష్ కత్తి తీసుకొని, వారి ఇంట్లోకి ప్రవేశించి, అన్నావదినపై దాడి చేశాడు. బాధితులు కేకలు వేయడంతో అక్కడి నుంచి పారి పోయాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రవీందర్, అతని భార్యను చుట్టుపక్కలవారు జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంతోష్‌పై కేసు నమోదు చేశారు. అప్పటి ఎస్సైలు ఎన్. మధుకర్, కె.రవీందర్ కేసు దర్యాప్తు పూర్తి చేశా రు. నిందితుడిని అరెస్టు చేసి, కోర్టులో చార్జిషీట్ వేశారు. న్యాయమూర్తి సాక్ష్యాధారాలను పరిశీలించి, సంతోష్‌కు శిక్ష ఖరారు చేశారు.

పంచభూతాలను కాపాడుకునేది బహుజనులు

- అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య చైర్‌పర్సన్ విమలక్క
- వేములవాడలో బతుకమ్మ వేడుకలు


బతుకమ్మ పేర్చుతున్న విమలక్క

వేములవాడ: పంచభూతాలను కాపాడుకునేది బహుజనులని, కబళించేవి బహుళజాతి కంపెనీలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య చైర్‌పర్సన్ విమలక్క అన్నారు. వేములవాడలో మంగళవారం జరిగిన సద్దుల బతుకమ్మ వేడుకలకు హాజరయ్యారు. మాజీ సర్పంచ్ నరాల సత్తమ్మ–పోశెట్టి నివాసంలో ఆమె కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మ పేర్చారు. అనంతరం తన మెట్టినింటి ప్రాంత యువతులు, మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. మూలవాగులోని బతుకమ్మ తెప్ప వద్దకు చేరుకుని నిమజ్జనోత్సవంలో పాల్గొన్నారు. విమలక్క పాటను మహిళలు, పురవాసులు ఆసక్తిగా విన్నారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను నిరసిస్తూ ఈనెల 2 నుంచి 10 వరకు ఊరూరా ఉద్యమాలు చేపడుతున్నామని తెలిపారు. ప్రకృతిని, వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. రాష్ట్రం మాఫియాల చేతుల్లోకి వెళ్లిపోయి అప్పుల రాష్ట్రంగా మిగులుతుందన్నారు. జనం ఉద్యమించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

పండుటాకులకు కష్టకాలం

- ఎవరూ లేక రోడ్డునపడిన దంపతులు
- బస్టాండ్‌లో కాలం వెళ్లదీస్తున్న అభాగ్యులు


బస్టాండ్ వద్ద తలదాచుకుంటున్న యాదమ్మ–లక్ష్మయ్య దంపతులు

ముస్తాబాద్(సిరిసిల్ల): అనారోగ్యానికి గురై.. నా అనే వారు లేక.. ఉండేందుకు గూడు కరువై.. చేతిలో చిల్లిగవ్వ లేని దంపతుల జీవితం బస్టాండ్‌కు చేరింది. జీవిత చరమాంకంలో జబ్బు పడి అచేతన స్థితికి చేరిన వీరిని చేరదీసేవారు కరువయ్యారు. అనారోగ్యానికి గురైన భార్యకు వైద్యం చేయించలేని నిస్సహాయస్థితిలో భర్త రోదనకు గురవుతున్న ఘటన ముస్తాబాద్‌లో జరిగింది. వివరాలు.. జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన సంగ యాదమ్మ– లక్ష్మయ్య దంపతులు ఉపాధి కోసం 15ఏళ్ల క్రితం ముస్తాబాద్‌కు వచ్చారు. లక్ష్మయ్య హోటల్‌లో పనిచేస్తుండగా యాదమ్మ పాచిపనిచేసేది. వీరికి ఇద్దరు కుమారులు జన్మించగా రెండునెలల వ్యవధిలో మృతిచెందారు. అద్దె ఇంట్లో ఉంటున్న దంపతులకు కష్టకాలం వచ్చింది. యాదమ్మ తీవ్ర అనారోగ్యానికి గురికాగా, ఆమెను భర్త లక్ష్మయ్య సిరిసిల్ల, సిద్దిపేట, హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో చూపించాడు. ఎక్కడా ఆమెకు సరైన వైద్యం అందించకపోగా, ప్రైవేటుకు వెళ్లాలంటూ సలహా ఇచ్చారు. రోజురోజుకూ యాదమ్మ ఆరోగ్యం క్షీణిస్తుండటంతో లక్ష్మయ్య హోటల్‌లో పని మానేసి, ఆమెతోనే ఉంటున్నాడు. చేతిలో చిల్లిగవ్వలేక ముస్తాబాద్ కొత్త బస్టాండ్‌లో వారం రోజులుగా ఉంటున్నారు. నిత్యం వందలాది మంది ప్రయాణికులు వీరిని చూసి జాలిపడుతున్నారే గానీ ఒక్కరూ ఏమైందమ్మా.. అని పలకరించడం లేదు. యాదమ్మకు మెరుగైన వైద్యం అందించాలంటే రూ.50వేలు ఖర్చవుతుందని లక్ష్మయ్య తెలిపాడు. తెలిసిన చోట అప్పు అడిగినా చిల్లిగవ్వ పుట్టలేదని రోదించాడు. తినేందుకు తిండి కరువైన వృద్ధ దంపతులకు, ఇక మెరుగైన వైద్యం ఎక్కడి నుంచి అందుతుందనేది ప్రశ్నగా మారింది. కనీసం వారికి సెల్ ఫోన్ కూడా లేకపోవడం వారి పరిస్థితిని తెలియజేస్తుంది. మానవతావాదులు స్పందించి యాదమ్మ కు కనీసం ఆసుపత్రికి వెళ్లేందుకు ఖర్చులైనా భరిస్తే ఓ నిండు ప్రాణం దక్కుతుంది.

'ఉపాధి'లో రూ.2.17 లక్షల అక్రమాలు

- జగిత్యాల డీఆర్డీవో అడిషనల్ పీడీ మదన్‌మోహన్
- మల్లాపూర్‌లో సామాజిక తనిఖీ ప్రజావేదిక


ఈజీఎస్ సిబ్బందిని ప్రశ్నిస్తున్న అడిషనల్ పీడీ మదన్‌మోహన్, అధికారులు

మల్లాపూర్(కోరుట్ల): ఉపాధిహామీ పనులు, కూలీల వేతనాలు చెల్లింపు, వన నర్సరీల నిర్వహణలో రూ.2,17,977 వరకు స్థానిక సిబ్బంది అక్రమాలకు పాల్పడ్డారని డీఆర్డీవో అడిషనల్ పీడీ మదన్‌మోహన్ తెలిపారు. మంగళవారం మల్లాపూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ పథకం 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏప్రిల్ 1, 2023 నుంచి మార్చి 30, 2024 వరకు మల్లాపూర్ మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో రూ.4.11 కోట్లతో ఉపాధిహామీ పనులు, కూలీలకు వేతనాల చెల్లింపు, వననర్సరీల నిర్వహణ చేపట్టారన్నారు. ఈ పనులతోపాటు నిధుల వినియోగంపై 13 బృందాలతో ఇంటింటా సర్వే చేయించినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా 425 పనుల నిర్వహణకు రూ.2,17,977 దుర్వినియోగానికి పాల్పడ్డారని, బాధ్యుల నుంచి ఆ మొత్తాన్ని రికవరీ చేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. డీవీవో చిన్నయ్య, జేవీపీ దేవేందర్, సోషల్ ఆడిట్ అసిస్టెంట్ మేనేజర్ కృష్ణారెడ్డి, ఎంపీడీవో జగదీశ్, ఎస్ఆర్పీ బాలయ్య, ఏపీవో సతీశ్, ఈసీ సాయికుమార్, టీఏలు సుధాకర్, సరిత, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సన్నాలు.. సగానికి పైగా తాలు

- వరి గొలుసు దశలో గింజల పరిస్థితి
- మహారాష్ట్రకు చెందిన ఓ కంపెనీ జైశ్రీరాం విత్తనాలు కొనుగోలు
- కరీంనగర్ మండలంలో దాదాపు 600 ఎకరాల్లో సాగు
- విత్తనాలు కల్తీవంటున్న రైతులు
- అధికారులు, కంపెనీ ప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆవేదన


తాలు ఉన్న వరిని చూపిస్తున్న రైతు ఓదెలు

'ఈ ఫొటోలో వరి గొలుసులను చూపిస్తున్న రైతు కరీంనగర్ మండలంలోని నల్లగుంటపల్లికి చెందిన తమ్మనవేణి ఓదెలు. మొగ్దుంపూర్‌లోని ఓ సీడ్స్ దుకాణంలో జైశ్రీరాం వరి విత్తనాలను కొనుగోలు చేసి, రెండెకరాల్లో సాగు చేశాడు. ప్రస్తుతం గొలుసు దశలో ఉంది. ధాన్యం గింజల్లో సగానికి పైగా తాలువే ఉన్నాయి. కల్తీ విత్తనాలతోనే ఇలా జరిగిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఈ పరిస్థితి ఒక్క ఓదెలుది మాత్రమే కాదు కరీంనగర్ మండలంలో జైశ్రీరాం విత్తనాలు సాగు చేసిన రైతులందరిది.'


చామనపల్లిలోని వరి గొలుసుల్లో తాలు గింజలు

కరీంనగర్‌రూరల్: ప్రభుత్వం రూ.500 బోనస్ చెల్లిస్తుందన్న ఆశతో రైతులు సన్న వరి సాగు చేశారు. కానీ, పంట గొలుసు దశలో సగానికి పైగా గింజలు తాలుగా ఉండటంతో విత్తనాలు కల్తీవని, తాము ఆర్థికంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్ మండలంలోని మొగ్దుంపూర్, గర్రెపల్లిలోని సీడ్స్ దుకాణాల నుంచి చెర్లభూత్కూర్, చామనపల్లి, నల్లగుంటపల్లి, ఇరుకుల్ల, నారాయణరావుపల్లె, సాంబయ్యపల్లి తదితర గ్రామాల రైతులు గత జూలైలో మహారాష్ట్రకు చెందిన ఓ ప్రైవేట్ కంపెనీ జైశ్రీరాం వరి విత్తనాలను కొనుగోలు చేసి, సాగు చేశారు. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో దాదాపు 600 ఎకరాల్లో వరి పంట గొలుసు దశలో ఉంది. అయితే, గోపాల్‌పూర్, చామనపల్లి, ఇరుకుల్ల, చెర్లభూత్కూర్ తదితర పల్లెలోని సుమారు 100 ఎకరాల్లోని వరి గొలుసుల్లో గింజలు సగానికి పైగా తాలుగా మారాయి. దీంతో చామనపల్లికి చెందిన పలువురు రైతులు వారం రోజుల క్రితం వ్యవసాయాధికారులు, సదరు కంపెనీ ప్రతినిధులకు ఫిర్యాదు చేశారు. అయితే, ఉన్నతాధికారులకు సమాచారం అందించామంటూ వ్యవసాయాధికారులు చేతులెత్తేశారు. అటు వ్యవసాయాధికారులు, ఇటు కంపెనీ ప్రతినిధులు పట్టించుకోవడం లేదని అన్నదాతలు ఆరోపిస్తున్నారు. మరోవైపు, గత శనివారం సుల్తానాబాద్ మండలంలోని నారాయణరావుపల్లెలో పంటలను పరిశీలించేందుకు వచ్చిన కంపెనీ ప్రతినిధులను రైతులు అడ్డుకున్నారు. పంటలకు పరిహారం చెల్లించాలంటూ వారిని నిర్బంధించి, ఆందోళన చేపట్టారు.

నాలుగెకరాల్లో తాలు..



సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో నేను ఐదెకరాల్లో సాగు చేసిన. ఎకరంలో వేసిన బీపీటీ వరి బాగుంది. నాలుగెకరాల్లో సాగు చేసిన జైశ్రీరాం వరి బాగా ఎత్తు పెరిగి, గొలుసులన్నీ తాలుగా మారాయి. గతంలో సాగు చేసినప్పుడు దిగుబడి ఎక్కువగానే వచ్చింది.

– కస్తూరి శ్రీనివాస్‌రెడ్డి, రైతు, ఇరుకుల్ల

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామన్నారు



మహారాష్ట్ర కంపెనీకి చెందిన జైశ్రీరాం వరి విత్తనాలను రైతులు సాగు చేశారు. గొలుసు దశలో గింజల్లో ఎక్కువగా తాలు ఉండటంతో మాకు ఫిర్యాదు చేశారు. చామనపల్లిలో పంటలను పరిశీలించి, కంపెనీ ప్రతినిధులకు సమాచారం ఇచ్చాం. క్షేత్రస్థాయిలో పరిశీలించి, చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

– బి.సత్యం, మండల వ్యవసాయాధికారి, కరీంనగర్



రాజన్నకు మొక్కులు

వేములవాడ: దసరా సెలవులు కొనసాగుతుండటంతో మంగళవారం సైతం రాజన్నను దర్శించుకునేందుకు 10 వేల మంది భక్తులు తరలివచ్చారు. బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. రాజన్న ఆలయాన్ని పూలతో ముస్తాబు చేశారు. పలువురు భక్తులు హోమం కార్యక్రమంలో పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపార రుణం, తక్కువ వడ్డీ రేటు, సిబిల్ అవసరం లేదు. NPA కూడ దరఖాస్తు చేసుకోవచ్చు. ఏజెంట్స్ కావలెను. అర్బన్‌ఫైనాన్స్,పార్తిబా. 8500236824. [T-283]

పాస్‌పోర్టు పోయినది

■ బి.నర్సయ్య S/o కొమురయ్య, H.NO. 1-49/2, కుర్మవాడ, గ్రా॥ వెలిచాల, మం॥ రామడుగు, జిల్లా॥ కరీంనగర్ అను నాయొక్క పాస్‌పోర్టు నెం. HY7066989227724 గలది ఒరిజినల్ పాస్‌పోర్టు పై అడ్రస్ పాత ఇంటి నుండి కొత్త ఇంటికి మారుతుండగా మార్గమధ్యలో పోయినది. కావున ఎవరికైన దొరికినచో పై అడ్రస్‌లో సంప్రదించి ఇవ్వగలరని మనవి. సెల్: 9010308364 [K-1246768]

www.sakshi.com

WANTED

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692 [M-1185473]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824